సాక్షి నంద్యాల

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆది, సోమవారం సెలవు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దర్శనానికి 2 గంటలకుపైగా సమయం పట్టింది.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పి.రవీంద్రారెడ్డి రూ.1,02,000 ఆదివారం విరాళంగా అందజేశారు.

దోన్‌లో సీఎం బహిరంగ సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



రేపు సీఎం వైఎస్ జగన్ రాక

- హంద్రీ–నీవా నీటితో చెరువులకు నీటిని నింపే ప్రాజెక్టును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- డోన్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగం
- సీఎం పర్యటనను ఖరారు చేస్తూ షెడ్యూల్ విడుదల చేసిన సీఎంఓ కార్యాలయం



కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటనను ఖరారు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్‌ను విడుదల చేసింది. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నుంచి డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని 77 చెరువులకు నీటిని నింపే ప్రాజెక్టును జాతికి అంకితం చేసేందుకు ముఖ్యమంత్రి కృష్ణగిరి మండలం ఆలంకొండకు రానున్నారు. అక్కడ పంపు హౌస్‌లో హంద్రీనీవా నీటిని చెరువులకు ఎత్తిపోసే మోటార్లకు స్విచ్ ఆన్ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలంకొండ సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. హెలిపాడ్ నుంచి పంపుహౌస్ వరకు బారికేడ్లను నిర్మించారు. పంపుహౌస్‌లో ప్రత్యేక పూజలు, మోటార్ల పనితీరుపై కూడా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం డోన్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. అక్కడ బహిరంగ సభకు సమీపంలో హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు. బహిరంగ సభా వేదికను కూడా సిద్ధం చేశారు. ఆయా పనులను ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తును నిర్వహించేందుకు రెండు జిల్లాల పోలీసులు చర్యలు చేపట్టారు.

సీఎం పర్యటన సాగుతుంది ఇలా...

- మంగళవారం ఉదయం 9.30 గంటలకు విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. అక్కడ 10 నిమిషాలపాటు ప్రజాప్రతినిధులతో మాట్లాడి జిల్లాలో రాజకీయ పరిస్థితులను తెలుసుకుంటారు.
- 10 గంటలకు కృష్ణగిరి మండలం ఆలంకొండ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ కూడా స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.10 నుంచి 10.25 గంటల వరకు హెచ్ఎన్ఎస్ఎస్ పంపుహౌస్ చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి చెరువులకు నీటిని ఎత్తిపోసే మోటార్లను స్విచ్ ఆన్‌చేస్తారు.
- 10.40 గంటలకు డోన్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు హెలికాప్టర్ ద్వారా చేరుకొని అక్కడ కూడా స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 11.05 గంటలకు డోన్‌లోని సభా వేదికకు చేరుకుంటారు.
- 11.15 గంటలకు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11.45 గంటలకు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు.
- 11.50నుంచి 12.30 గంటల వరకు సీఎం ప్రసంగిస్తారు.
- 12.50 గంటలకు తిరిగి డోన్‌లోని హెలిపాడ్‌కు చేరుకొని స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 01.45 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు.
- 01.45 గంటలకు ఓర్వకల్లు నుంచి విమానంలో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్తారు.

జయ జయ.. జలహో!

- కరువు నేలకు రేపు పండుగ రోజు
- పశ్చిమ పల్లెల దశాబ్దాల కల సాకారం
- 'హంద్రీ–నీవా'తో చెరువులకు నీరందించే పథకం పూర్తి
- జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఆలంకొండ వద్ద ఏర్పాట్లు పూర్తి

బీడు భూములు బంగారు పంటలు పండే మంచి రోజు రానే వచ్చింది. కృష్ణమ్మ బిరబిరా పరుగులిడుతూ కరువు నేలకు పండుగను తీసుకొస్తోంది. ఇందుకు కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద పంప్‌హౌస్ వేదిక కానుంది. హంద్రీ–నీవా నీటితో చెరువులు నింపే మహా క్రతువుకు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నో ఏళ్ల కల సాకారం కానుండటంతో 'జయ జయ..జలహో' అంటూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పశ్చిమ పల్లెల్లో సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి.

సాక్షి, నంద్యాల/కర్నూలు సిటీ/కృష్ణగిరి: చెరువులను తవ్వించి రాయలసీమను శ్రీ కృష్ణదేవరాయులు సస్యశ్యామలం చేశారు. నాటి వైభవాన్ని మళ్లీ తీసుకొస్తూ.. 77 చెరువులకు నీరు మళ్లించే పథకాన్ని ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాల్లో పంటలు పండక, ప్రజల జీవన పరిస్థితి దయనీయంగా ఉండేది. ఈ దుస్థితిని చూసి 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కృష్ణాజలాలను హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కర్నూలు జిల్లా నుంచి చిత్తూరు వరకు తీసుకెళ్లేలా రూపకల్పన చేశారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో ఏడు ఎత్తిపోతల పథకాలు, రెండు రిజర్వాయర్లతోపాటు రెండు చానల్ కాల్వల ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

చెరువులకు నీటి మళ్లింపు పథకం

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నుంచి చెరువులకు కూడా నీరు ఇవ్వవచ్చని డీపీఆర్‌లోనే ఉంది. హంద్రీనీవా కాల్వ ద్వారా చెరువులకు నీరు ఇస్తామని అదిగో...ఇదిగో అంటూ నాలుగున్నరేళ్ల కాలయాపన చేసిన టీడీపీ ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడిగా జీఓలు ఇచ్చింది. తూతూ మంత్రంగా 2018 అక్టోబరులో పనులు మొదలుపెట్టారు. 182 ఎకరాలకు భూసేకరణ చేయాల్సి ఉండగా ఒక్క ఎకరం కూడా చేయలేదు. 4.78 హెక్టార్ల ఫారెస్ట్ భూమికి క్లియరెన్స్ తీసుకోలేదు. టీడీపీ హయాంలో కేవలం పైపులైన్ పనులు 13 శాతం మాత్రమే చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకుని భూసేకరణ పూర్తి చేయించారు. ఫారెస్ట్ భూములకు స్టేజ్–1, స్టేజ్–2 అనుమతులు తీసుకొని పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసి ట్రయల్ రన్ చేశారు. ముందుగా తయారు చేసిన ప్రాజెక్టులో 68 చెరువులకు మరో 9 చెరువులను చేర్చి ఈ పథకాన్ని మరింత బలోపేతం చేశారు.



తుగ్గలి మండలం బొందిమడుగుల చెరువులో కళకళలాడుతున్న హంద్రీ నీరు

పథకానికి సంవత్సరాల వారీగా చేసిన ఖర్చు..

సంవత్సరం	ఖర్చు (రూ.కోట్లలో)
2018-19	33.93
2019-20	22.43
2020-21	49.39
2021-22	57.69
2022-23	17.23
2023-24	28.64

పథకం పనిచేస్తుందిలా..

ఆలంకొండ సమీపంలోని పంపింగ్ స్టేషన్‌లో 3,800హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేశారు. వీటి నుంచి 5.625 కిలోమీటర్ల మెయిన్ పైప్‌లైన్ ద్వారా 116 మీటర్ల ఎత్తున కటారుకొండ పంచాయతీలోని పులిచెర్ల సమీపంలో కొండపై డెలివరీ చాంబర్‌కు నీరు వెళ్తాయి. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసి మూడు వైపుల ద్వారా చెరువులకు మళ్లిస్తారు. వీటికి కింద అధికారికంగా 10,394 ఎకరాల సాగు ఆయకట్టుగా ఉంది. చాలా చోట్ల గ్రావిటీ ద్వారా వాగుల్లోకి నీరు వెళ్లనుండటంతో ఆయకట్టు మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే 57 గ్రామాల్లో తాగు నీటి సమస్య తీరనుంది.



కరువు ఉండదు

మా చెరువు కింద 3వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. దాదాపు 15గ్రామాల రైతులు వివిధ పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రతి ఏడాది చెరువు కింద మూడు వేల ఎకరాల్లో వరిసాగవుతోంది. హంద్రీనీవా నుంచి నీరు వస్తే కరువు ఉండదు. – ఆదినారాయణ, వెంకటాపురం, డోన్ మండలం



ప్రజల అదృష్టం

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంతో చెరగని ముద్ర వేశారు. అలాగే జగనన్న పాలనలో కూడా 77 చెరువులకు నీరు నింపే పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రే వచ్చి స్వయంగా ప్రారంభించడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టం. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వేల ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందనుంది. – కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్యే పత్తికొండ



మంచి రోజులు వచ్చాయి

మా గ్రామానికి సమీపంలోనే హంద్రీ–నీవా కాలువ వెళ్తోంది. ఈ కాలువ నుంచి చెరువులకు నీరు వచ్చేందుకు అవకాశం లేదు. అలాంటి దాన్ని ఈ మూడేళ్లలో పూర్తిచేసి బోయినాల, కటారుకొండ చెరువుకు నీరు వదలడంతో మంచి రోజులు వచ్చాయి. –రామచంద్రుడు రైతు, కటారుకొండ, కృష్ణగిరి మండలం

69 చెరువులకు నీరు అందిస్తున్నాం


77 చెరువులకు నీరు మళ్లించే పథకానికి సంబంధించి పనులు పూర్తయ్యాయి. గతంలో ఫారెస్టు . ఇతర అనుమతులు లేక పనులు చేయలేకపోయాం. మొదట 68 చెరువులకు గాను కొత్తగా 9 చేరాయి. ఇప్పుడు 69 చెరువులకు మాత్రమే నీరు అందించేలా చర్యలు తీసుకున్నాం. మరో 8 చెరువులకు సంబంధించి పనులు చేపడుతున్నాం. – రామకృష్ణ, ఇరిగేషన్ డీఈ



ఆలంకొండ సమీపంలో పంప్‌హౌస్



పంప్‌హౌస్‌లో భారీ మోటార్లు



పులిచెర్ల వద్ద కొండపై డెలివరీ చాంబర్

నీరందించే చెరువులు మండలాల వారీగా..

కృష్ణగిరి: కటారుకొండ, కర్లకుంట, ఆలంకొండ, కూర్మగిరి
తుగ్గలి: బొందిమడుగుల, ముక్కెళ్ల, రాతన, ఆర్.ఎస్. పెండేకల్లు, రాంపల్లి, చెన్నంపల్లి, పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి, తుగ్గలి, ఎద్దులదొడ్డి, అయ్యవారి కుంట, మామిళ్ల కుంట, బాపనికుంట
మద్దికెర: మదనాంతపురం, పెరవలి **పత్తికొండ:** చందోలి, చక్రాల, పత్తికొండ
వెల్దుర్తి: బోగోలు, సూదేపల్లె, పేరేముల, యదరాల, చౌటి, రత్నపల్లి, ఖందాన్, సర్పాపురం, గోవర్ధనగిరి, ఎల్. బండ, సర్పరాజపురం, ఎర్ర చెరువు, వీరగట్టు
డోన్: మల్లెంపల్లి, వెంకటాపురం, జగదుర్తి, ఉడుములపాడు, యాపదిన్నె, కల్వనకుంట, కొచ్చెరువు, యల్లారెడ్డి(బొంతిరాళ్ల), ఎస్. గుండాల, చనుగొండ, నల్ల చెరువు, చనుగొండ్ల ఆర్డీటీ ఊట చెరువు, నెమళ్ల కుంట, చెన్నకేశవస్వామి గుడి చెక్‌డ్యాం, ఓబులాపురానికి చెందిన నడిమికుంట, జమ్మికుంటలు, కొత్తబురుజు
ప్యాపిలి: పెద్దపొదెళ్ల, వెంగళాంపల్లి, దేవరకుంట, ప్యాపిలి ఊట చెరువు, ఎనుగుమర్రి, కాకనాల, సర్దారు కుంట, వెంగళాంపల్లి చిన్న చెరువు, నాయుని చెరువు, వెంకటయ్య చెరువు, బొమ్మికుంట, గుడిపాడు, వెంగళాంపల్లి ఊట చెరువు, కలచట్ల, ఊటకొండ, కొత్తకుంట, చిన్న పొదెళ్ల చిన్న చెరువు, పెద్ద చెరువు, చంద్రపల్లి
దేవనకొండ: నల్లగుండ, నల్లచెలిమల చిన్న చెరువు, పెద్ద చెరువు.
పాణ్యం: కొల్లంపల్లి తండా, ఉలిందకొండ

రాయితీపై ప్రత్యామ్నాయ పంట విత్తనాలు

- జిల్లాకు 1733 క్వింటాళ్ల ఉలవలు, కంది, జొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు విత్తనాలు
- 80 శాతం రాయితీపై అందజేత
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

నంద్యాల(సెంట్రల్): వర్షాభావ పరిస్థితులతో నెలకొన్న ప్రతికూలతలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు రైతులకు ఉపశమన చర్యలు చేపడుతోంది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా నంద్యాల జిల్లాకు 1,733 క్వింటాళ్ల పలు రకాల విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ కమిషనర్/సంచాలకుల ఆదేశాల మేరకు ఈ ఖరీఫ్‌కు సంబంధించి ప్రత్యామ్నాయ విత్తన పంపిణీని 80 శాతం రాయితీతో చేపడుతున్నారు. ఇందులో మినుములు (పీయూ31) 425 క్వింటాళ్లు, ఉలవలు 75 క్వింటాళ్లు, కంది (ఎల్‌ఆర్‌జీ 52) రకం 87 క్వింటాళ్లు, కొర్రలు 67 క్వింటాళ్లు, జొన్నలు 886 క్వింటాళ్లు, మొక్కజొన్నలు 177 క్వింటాళ్లు, సజ్జలు 4 క్వింటాళ్లు, పొద్దుతిరుగుడు 12 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉంచారు. రాయితీ విత్తనాలు పొందడానికి... గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకుల పరిశీలనలో సంబంధిత రైతు పొలం బీడు ఉన్నట్లు, లేదా పంట దెబ్బతిన్నట్లు తేలాలి. అర్హులైన రైతులకు 2 హెక్టార్లకు సరిపడ విత్తనాన్ని పంట ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని మంజూరు చేస్తారు. పంపిణీ చేసిన విత్తనం నాణ్యంగా లేకపోతే వీఏఏల ద్వారా వ్యవసాయాధికారులకు తెలిపితే తగు చర్యలు తీసుకుని వేరే విత్తనాన్ని ఇస్తారు. డీ-క్రిషి యాప్ ద్వారా విత్తనాలు అందజేస్తారు. ప్రత్యామ్నాయ పంటల్ని ఈ–క్రాప్ చేయడంతో పాటు, విత్తన లబ్ధిదారుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్‌బీకేల వద్ద ప్రదర్శించాలి.



బేతంచెర్లలో గణేష్ ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ పట్టణంలో వినాయక విగ్రహాల విక్రయ సందడి

గణేష్.. జోష్

నంద్యాల: గణపతి నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధమైంది. **ఒక రోజు ముందుగానే నంద్యాల జిల్లాలో సందడి షురూ అయ్యింది.** సోమవారం వినాయక చవితి సందర్భంగా విఘ్నేషుడిని పూజించేందుకు భక్తకోటి ఏర్పాట్లు చేసుకుంది. జిల్లా వ్యాప్తంగా గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఊరువాడ.. పట్టణం.. నగరం అన్న తేడా లేకుండా మండపాలు.. మిరుమిట్లు గొలిపే లైటింగ్.. డీజే పాటలు.. చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా అందరూ కలిసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిర్వాహకులు మండపాలను శోభాయమానంగా అలంకరించారు. కొందరు మట్టి ప్రతిమలను, మరి కొందరు వైవిధ్యభరితమైన విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ విగ్రహాలతో కలపి దాదాపు నాలుగే వేలకు పైగా ప్రతిష్ఠించనున్నారు. ఆదివారం జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె, డోన్ తదితర ప్రాంతాల్లోని మార్కెట్‌లో విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో ప్రజలు బిజీబిజీగా కనిపించారు.

న్యూస్‌రీల్

శిశువుకు 24 వేళ్లు



కోవెలకుంట్ల: చేతులకు ఐదువేళ్లు కాకుండా ఒకటి, రెండు వేళ్లు ఎక్కువగా ఉన్న వాళ్లను చూసింటాము. అయితే ఓ శిశువుకు రెండు చేతులు, కాళ్లకు కలిపి ఏకంగా 24 వేళ్లతో జన్మించిన అరుదైన సంఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకోవడం విశేషం. పట్టణంలోని స్వామినగర్ కాలనీకి చెందిన గ్రామ వలంటీర్ వెంకటలక్ష్మి వారం రోజుల క్రితం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఒక్కో చేతికి ఆరువేళ్లు, ఒక్కో కాలికి ఆరువేళ్ల చొప్పున రెండు చేతులు, కాళ్లకు సంబంధించి మొత్తం 24 వేళ్లు ఉన్నాయి.

855.20 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 855.20 అడుగులకు చేరుకుంది. జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం గత కొద్ది రోజులుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు నీరు విడుదల అవుతుండడంతో నీటిమట్టం క్రమేపీ తగ్గుతుంది. శనివారం నుంచి ఆదివారం వరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,958 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,510, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 92.4860 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు చకచకా

- డోన్, ఆలంకొండ వద్ద ముమ్మరంగా పనులు
- పర్యవేక్షిస్తున్న ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు


డోన్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ


ఆలంకొండ ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పర్యటనకు గడువు రెండు రోజులే ఉండటంతో పనులు శరవేగంగా చేస్తున్నారు. హంద్రీనీవా నీటిని ఉమ్మడి జిల్లాలో 77 చెరువులకు మళ్లించేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం జగన్ వస్తున్నారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అనంతరం, డోన్ పట్టణంలో భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సృజన, డాక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీలు శ్రీకాంత్, రఘువీర్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సభాస్థలిని పరిశీలించిన మంత్రి బుగ్గన..

డోన్ పట్టణ శివారులోని వెంకటనాయునిపల్లె సమీపంలో నిర్వహిస్తున్న బహిరంగ సభా స్థలాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మంత్రి వెంట నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీశామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డీఓ వెంకటరెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు. సభా వేదిక, ప్రేక్షకుల గ్యాలరీ, వీఐపీల గ్యాలరీల ఏర్పాట్ల పనులతో పాటు హెలిపాడ్ పనులు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డీఆర్‌ఓ పుల్లయ్య, సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు జానకిరాముడు తదితరులు ఉన్నారు.

పకడ్బందీ బందోబస్తు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై డోన్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలంకొండ వద్ద హంద్రీనీవా కాల్వపై ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అనంతరం డోన్‌లో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కొక్క విభాగానికి ఒక్కో ఉన్నతాధికారికి బాధ్యతలు అప్పగించామన్నారు. సీఎం పర్యటనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కూడా హెలిపాడ్, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ రెగ్యులేషన్, రూట్ బందోబస్తు, కాన్వాయ్ భద్రత లాంటి వాటిపై స్వయంగా అధికారులతో చర్చించి బాధ్యతలు అప్పగించినట్లు వారు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.


డోన్‌లో బహిరంగ సభా స్థలిలో విశాలమైన షెడ్


హెలిపాడ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆదివారం వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ హెలిపాడ్, పార్కింగ్, కాన్వాయ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, లిఫ్ట్ వద్ద విధులు నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులు, సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హెలిపాడ్ నుంచి కిలో మీటరు దూరంలో ఎత్తిపోతల పథకానికి వచ్చే సీఎం కాన్వాయ్ మార్గంలో రహదారికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వేదిక వద్ద గ్రీన్ రూంను ఏర్పాటు చేయాలని, పంప్‌హౌస్ భవనాన్ని ఆకట్టుకునే విధంగా ఆలంకరించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షం వచ్చినా ఎలాంటి ఆటంకం లేకుండా హెలిపాడ్, పంప్‌హౌస్ వద్ద వాటర్‌ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సృజన ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ ఎస్ఈలు రెడ్డి శేఖర్‌రెడ్డి, నాగరాజు, సుబ్రమణ్యం, జెడ్పీ సీఈఓ నారసరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, తహసీల్దార్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. రాజకీయ నాయకులు తమ సొంత ప్రయోజనాల కోసం ఉద్యోగులను బలి చేయడం సరికాదన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఎన్నుకున్న ట్లు ఆయన వివరించారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎండీ అంజిబాబు, జిల్లా కార్యదర్శిగా వీరేష్‌గౌడ్, అధ్యక్షుడిగా రాజునాయక్, ఉపాధ్యక్షులుగా వీరన్న, గిడ్డయ్య, సహాయ కార్యదర్శులుగా గోపాలకృష్ణ, నవీన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులుగా మధు, సుంకన్న, ఆనంద్, ఆది, లక్ష్మీనారాయణరెడ్డి, హనుమంతులను ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


లావణ్య (ఫైల్)

కొత్తపల్లి: కొక్కెరంచ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొక్కెరంచ గ్రామానికి చెందిన నరేంద్రగౌడుకు పాములపాడు మండలం బానకచెర్ల గ్రామానికి చెందిన ఈడిగ లావణ్య(24)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం కుటుంబ కలహాలతో భర్తతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన లావణ్య విషగుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కాగా లావణ్య భర్త నరేంద్రగౌడు, అత్త, మామలు కలిసి పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని మృతురాలి బంధువులు ఆరోపించారు. తనకు న్యాయం జరిగేవరకు పోస్టుమార్టం నిర్వహించేది లేదని హాస్పిటల్ మందు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. ఎస్ఐ హుస్సేబాషను వివరణ కోరగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

రగ్బీ అండర్-19 జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 23వ తేదీ ఎస్‌జీఎఫ్ ఉమ్మ డి జిల్లా స్థాయి రగ్బీ అండర్-19 బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

వైభవంగా రాయరు పాదుక పూజ


పాదపూజ నిర్వహిస్తున్న మఠం దివాన్ వాదిరాజాచార్


మంత్రాలయం: శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ఆదివారం శ్రీమఠం పూజామందిరంలో రాయరు పాదుక పూజ వైభవంగా చేపట్టారు. ప్రత్యేక బంగారు ఆసనంపై రాఘవేంద్రస్వామి పాదుకలు, బృందావన ప్రతిమ కొలువుంచారు. మఠం దివాన్ వాదిరాజాచార్ శాస్త్రోక్తంగా బంగారు పాదుకలకు ముత్యాలు, విరులతో అభిషేకం చేశారు. బృందావన ప్రతిమను విశేషంగా అలంకరించి మంత్రోచ్చారణలతో విశిష్ట పూజలు నిర్వహించారు. పాదుక పూజా వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల తాకిడితో పూజా మందిరం కిటకిట లాడింది. రాయరు పాదుక పూజలో వేలాది మంది సేవా భక్తులు పాల్గొన్నారు.

సీమ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా సురేంద్ర


సురేంద్రకు ఎంపిక పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నేత నక్కలమిట్ట శ్రీనివాసులు

కర్నూలు(రాజ్‌విహార్): రాయలసీమ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కురువ సురేంద్ర ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక బీ. క్యాంప్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు నూతన అధ్యక్షుడిగా సురేంద్రను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురువ సురేంద్ర బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తున్నారని, అందుకే ఆయన్ను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, కార్యదర్శి రామకృష్ణ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు పోతులపాడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళా విభాగం కార్యదర్శి శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీశైలంలో గణపతి నవరాత్రోత్సవాలు



పుష్పాలతో అలంకరించిన సాక్షిగణపతి ఆలయం, విద్యుత్ దీపాల అలంకరణలో గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో రత్నగర్భ గణపతికి, శ్రీశైలం సమీపంలోని సాక్షి గణపతి స్వామికి, యాగశాలలోని పంచలోహమూర్తికి ప్రతి నిత్యం వ్రత కల్పం విశేషార్చనలు నిర్వహించడం జరుగుతుంది. ఆదే విధంగా సాక్షిగణపతి వద్ద మృత్తికా గణపతిని (మట్టి గణపతి) కూడా నెలకొల్పి ఉత్సవ సమయంలో ప్రతి రోజూ వ్రత కల్ప పూర్వకంగా పూజాధికాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సాక్షిగణపతి వద్ద విద్యుదీకరణ, వివిధ రకాల పుష్పాలంకరణ ఏర్పాటు చేశారు. కాగా సోమవారం యాగశాల ప్రవేశం, గణపతి హోమం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగానే ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేది వరకు ప్రతి రోజు పూజలు నిర్వహిస్తారు.

విశ్వకర్మ ఆశయాలను నెరవేర్చుతాం

- మేయర్ బీవైరామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని,హాఫీజ్‌ఖాన్
- ప్రప్రథమంగా అధికారికంగా విశ్వకర్మ జయంతి వేడుకల నిర్వహణ
- ప్రత్యేక జీఓ జారీపై బీసీ సంఘాల హర్షం


విశ్వకర్మ పూజల్లో పాల్గొన్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ ఆశయాలను నెరవేర్చుతామని కర్నూలు నగర మేయర్ బీవైరామయ్య, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ప్రప్రథమంగా శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని అధికారికంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మేలు చేసే వ్యక్తి అన్నారు. విశ్వకర్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకోవడానికి జీఓ నంబర్ 24ను విడుదల చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. దేవతల రూపాలను ప్రజలకు తెలిపిన వ్యక్తి విశ్వకర్మ అని, ఆయన జీవిత చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాల్సి ఉందన్నారు. విశ్వకర్మ జయంతిని పండుగలా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. విశ్వాన్ని సృష్టించిన ఇంజనీరు విశ్వకర్మ అని, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఇప్పుడున్న ఆర్కిటెక్ అనేది గతంలోని కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, ఆచార్యుల నుంచి వచ్చిందన్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఆర్కిటెక్ ద్వారా ఎంతో అందమైన సామగ్రిని డిజైన్ చేసకుంటామని, ఆనాడు విశ్వకర్మ తన చేతితో అందమైన సామగ్రిని తయారు చేసి ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఎందాకైనా వెళ్తున్నారని, ఆయనకు ఆయా వర్గాల ప్రజలకు అండగా నిలవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకరరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంక్షేమ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, కటిక కార్పొరేషన్ డైరెక్టర్ గౌతమ్, నాయకులు టీకే నారాయణాచారి, విజయచారి, రవికుమార్ ఆచారి పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2023 జూలై, ఆగస్టులో జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు విడుదల చేశారు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు 9,253 మంది రాయగా 4,458 మంది విద్యార్థులు పాసయ్యారని ఆయన తెలిపారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.inలో చూడాలన్నారు.

క్లుప్తంగా

విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో శుభాలు కలగాలి

- మంత్రులు బుగ్గన, గుమ్మనూరు జయరాం

కర్నూలు(సెంట్రల్): విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలందరికీ సకల శుభాలుకలగాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు వారు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రతి కుటుంబ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. మట్టి గణపతిని పూజించి వినాయక చవితిని పర్యావరణ హితగా జరుపుకోవాలని సూచించారు.

చేపలవేటకు వెళ్లి గిరిజనుడి మృతి

ఆత్మకూరురూరల్: నల్లకాల్వ శివారులోని రుద్రకోడు చెంచు గూడెంకు చెందిన టోపి చిన్న గొలుసు (37)ప్రమాదవశాత్తు వెలుగోడు బాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం చేపల వేట కోసం రిజర్వాయర్ వద్దకు వెళ్లిన ఆయన రిజర్వాయర్‌లో దిగేటప్పు జారి పడి బురదలో కూరుకుపోయి మరణించినట్లు తెలుస్తోంది. వెలుగోడు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నాగమ్మ, ఇరువురు సంతానం ఉన్నారు.

టీబీ డ్యామ్‌లో 64 టీఎంసీలు


తుంగభద్ర జలాశయంలో చేరిన వరద నీరు

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో 64 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతుంది. 1,633 అడుగులతో 105.788 టీఎంసీల డ్యాం పూర్తి మట్టానికిగాను ఆదివారం 1,621 అడుగులతో 64 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో 1,739 క్యూసెక్కులుండగా, ఔట్‌ఫ్లో 9,935 క్యూసెక్కులుంది. ఇక దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు సంబంధించి ఆంధ్ర కాలువ ప్రారంభమయ్యే 250 కి.మీ (హాన్వాళ్ సెక్షన్) వద్ద 544 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది.

కారును ఢీకొన్న లారీ

- ఆదోని జడ్జితోపాటు మరో ఇద్దరికి గాయాలు

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని చిలంకూరు గ్రామ సమీపాన ఆదివారం కారును లారీ ఢీకొనడంతో ఆదోని సీనియర్ సివిల్ జడ్జి శైలజతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని కొతాళం గ్రామానికి చెందిన శైలజ ఆదోని సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తల్లితో కలిసి కారులో కడప వైపు వెళ్తుండగా ఎదురుగా ఎర్రగుంట్ల వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో కారు డ్రైవరు తలారీ సుధాకర్, జడ్జి శైలజ, ఆమె తల్లి వెంకటసుబ్బమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారు కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు డ్రైవర్ తలారీ సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ల విద్యుత్ తీగలు చోరీ

జూపాడుబంగ్లా: ఏబీఆర్ కాల్వ వెంట ఉన్న 60 మంది రైతుల విద్యుత్ మోటార్లకు చెందిన తీగలను ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, మిట్టకందాల, బుద్దానగర్ గ్రామాలకు చెందిన బాధిత రైతులు చెన్నారెడ్డి, ఎల్లాల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సూరి, పిచ్చయ్య, ప్రసాదుతో పాటు మరి కొందరు రైతుల విద్యుత్ మోటార్ల తీగలు చోరీకి గురయ్యాయి. గ్రామాలకు సమీపంలో ఏబీఆర్ కాల్వ ఉండటంతో దాని వెంట పొలాలున్న రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్ల విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకొని చోరీకి పాల్పడ్డారు. దీంతో విద్యుత్ మోటార్లు ఆడక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఆరు మాసాల క్రితం విద్యుత్ తీగలను కత్తిరించుకొని వెళ్తున్న దొంగలను తూడిచెర్ల గ్రామానికి చెందిన రైతులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దొంగలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారని రైతులు విమర్శిస్తున్నారు. దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

- ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడితే వాతావరణం కలుషితమవుతుందని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ డీపీడీ శ్రీలత మాట్లాడుతూ... ఇన్‌పుట్ డీలర్లు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకుని రైతులకు వివరించాలని పేర్కొన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... భాస్వరం ఎరువులు పైపాటుగా వాడటం వల్ల రైతుకు ఖర్చు పెరుగుతుంద న్నారు. ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ పంచాంగాలను పంపిణీ చేశారు.